| ఒడిషా | బీర్సాముండా జయంతి సభ |
|---|---|

**2018** నవంబర్ 25న ఒడిషా - ఛాసీమూలియా సంఘ్ మరియు ఏరియా శ్రమజీవిసంఘ్‌ల ఆధ్వర్యంలో కియోంజర్‌జిల్లా - బీర్సాపాడియో వద్ద బీర్సాముండా జయంతి సభను నిర్వహించారు.

భారతదేశంలో బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా సాగిన ఆదివాసీ పోరాటాలకు జాజ్వలమానమైన చిహ్నంగా షహీద్ బీర్సాముండా (1875-1900) నిలుస్తాడు. ఛోటా నాగపూర్ ప్రాంతంలో బీర్సాముండా తన తిరుగుబాటు కార్యక్రమాలను కొనసాగించాడు. ఈ పోరాటంలోకి వేలాదిమంది ఆదివాసులను సమీకరించి వారిచే సాయుధ తిరుగుబాటు చేయించాడు. తమ అడవులపైన, భూములపైన తమదే హక్కు అనే నినాదంతో ఆదివాసులను సమీకరించి, ఆ హక్కుల సాధనకోసం వారిని కార్యాచరణలోకి కదిలించాడు. స్థానిక దోపిడీ దారులకు వ్యతిరేక పోరాటం లాగా ఇది ప్రారంభమై, బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా చారిత్రాత్మక సాయుధ తిరుగుబాటుగా అభివృద్ధి చెందింది. మూండా, భువా, ఒరాన్, సంథాల్, జువాన్ మొదలైన వివిధ ఆదివాసీ తెగల నడుమ బీర్సాముండా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకునిగా ఆవిర్భవించాడు.

ఆదివాసీ ప్రాంతాల్లో సాంప్రదాయకంగా ఆదివాసులు అనుభవించే హక్కులను బ్రిటిష్ వలసపాలకులు గుంజివేసుకొన్నారు. ఆదివాసులను వారి భూములలోనే వారిని వేతన కూలీలుగా మార్చారు. బ్రిటిష్ వలసపాలకులు ఒక తరహా భూస్వామ్య విధానాన్ని ప్రోత్సహించి, ఆదివాసీ ప్రజానీకంపై దోపిడీ పీడనలను తీవ్రం చేశారు. మనదేశంలో ఆదివాసుల తిరుగుబాట్లు సంభవించటానికి ఇది ఒక బలమైన కారణంగా వుంది. ఛోటా నాగపూర్ ప్రాంతంలో బీర్సాముండా నాయకత్వంలో, చుట్టుముట్టిన ఆదివాసుల తిరుగుబాటుతో బ్రిటిష్ వలసపాలకులు గంగవెర్రు లెత్తారు. తీవ్ర నిర్బంధం ప్రయోగించైనా సరే, వారు దీనిని అణచివేయదలిచారు. అంతిమంగా బీర్సాముండాను బ్రిటిష్ పోలీసు అధికారులు అరెస్టు చేయగలిగారు. బీర్సాముండాను రాంచీ జైలులో నిర్బంధించగా, ఆయన ఆ జైలులోనే అమరుడయ్యాడు. అమరుడయ్యేనాటికి బీర్సాముండా వయస్సు కేవలం 25 సం॥లు మాత్రమే. ఆదివాసుల తిరుగుబాట్లను కిరాతకంగా అణచివేసిన తర్వాత, ఆదివాసుల హక్కులను పరిరక్షించే పేరిటనే బ్రిటిష్ వలసవాదులు కొన్ని ఆదివాసీ చట్టాలు చేశారు. వాస్తవానికి, ఈ చట్టాలన్నీ ఆదివాసీ ప్రజలను జోకొట్టి, వారి పోరాటాలను నీరుగార్చేందుకు ఉద్దేశించినవే.

పలు గ్రామాలకు చెందిన 200మంది ప్రజానీకం బీర్సాముండా జయంతి సభకు హాజరయ్యారు. కా॥ శ్రీకాంత్‌మొహంతి (ఛాసీమూలియా సంఘ్, ఒడిషా), కా॥బసుదేవ్ దాస్ (ఛాసీమూలియా సంఘ్ ఒడిషా రాష్ట్ర నాయకులు), కా॥ రమేష్ (శ్రమజీవి సంఘ్ నాయకులు), మరియు ఇతర నాయకులు ఈ సభలో పాల్గొని ప్రసంగించారు.

బీర్సాముండా కొనసాగించిన పోరాటం ఈనాటికీ ప్రాధాన్యత కలిగిందిగా వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకుల చెప్పుల్లో కాళ్ళు దూర్చిన భారత పాలకులు ఆదివాసీ వ్యతిరేక; సామ్రాజ్యవాద, ఫ్యూడల్ అనుకూల విధానాలను అమలుచేస్తూ వస్తున్నారు. భారత పాలకులు ఈ బాటలో సాగుతూ ఒక దాని వెంబడి మరొకటిగా ఆదివాసీ హక్కులను లాగివేస్తున్నారు. అటవీ ప్రాంతాలలోని ఆదివాసీ భూములలో అత్యధిక భాగం ఈనాడు ఆదివాసీ యేతర భూస్వాముల అధీనంలో వుంది. ఇప్పటికే ఆదివాసులు అధిక సంఖ్యలో వారి నివాసాల నుండి విస్థాపనకు గురిచేయబడుతూ నిర్వాసితు లవుతున్నారు. ఆదివాసులు తమ భూములు, అడవి, ఖనిజసంపద, సహజ వనరులపై హక్కులను గనుల తవ్వకం, పరిశ్రమల ఏర్పాటు, అభయారణ్య ఏర్పాటు మొదలైన పేర్లతో కోల్పోతున్నారు. వీరి భూములు, వనరులన్నింటినీ పాలకులు భారత బడాకార్పొరేటు సంస్థల మరియు విదేశీ బహుళజాతి సంస్థల చేతుల్లో పెడుతున్నారు. కనుకనే, దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆదివాసులు పోరాట మార్గాన సాగుతున్నారు. ఒడిషాలో సాగుతోన్న కళింగనగర్, కాశీపూర్ వంటి పోరాటాలు కూడా ఈ నేపథ్యంలో ముందుకు వచ్చినవే. ఇతర ప్రాంతాలలో ఆదివాసులు తమ భూములపై, నీటి వనరులపై, ఖనిజ, ఇతర సహజ సంపదలపై హక్కులకోసం జరిపే పోరాటాలన్నీ దీనిలో భాగమే. ఈ పోరాటా లన్నింటినీ మరింత సంఘటితం, దృఢతరం చేయాల్సిన అవసరముంది. అదేవిధంగా ఈ పోరాటాలను కార్మిక, రైతాంగ ఇతర పీడిత ప్రజల పోరాటాలతో అవిభాజ్యమైన పోరాటాలుగా కొనసాగించాలి. ఈ దేశంలో ఫ్యూడల్, సామ్రాజ్యవాద దోపిడీ అణచివేతలను రూపుమాపి, నూతన ప్రజాస్వామిక సమాజాన్ని స్థాపించే దిశగా ఈ పోరాటాలు ఎక్కుపెట్టాలి. ఈ లక్ష్యాలకు మనం మరింత స్ఫూర్తితో, నిశ్చయాత్మకతతో పునరంకితంగావటానికి బీర్సాముండా జీవితం, పోరాటం ఉత్తేజం కలిగించాలని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు.

ooooo